క్లుప్తంగా

సర్వాయి పాపన్నను స్ఫూర్తిగా తీసుకోవాలి

వరంగల్ లీగల్: సమసమాజ స్థాపన నిర్మాణం కోసం, బహుజనుల రాజ్యాధికారం కోసం తన ప్రాణాలను సైతం ఫణంగా పెట్టిన పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్ సూచించారు. సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకొని వరంగల్ కోర్టు ప్రాంగణంలో వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ల బాధ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

తీజ్ ఉత్సవాలు ప్రారంభం

హన్మకొండ: గోర్ బంజారా ఆధ్వర్యంలో హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన్ భవన్‌లో మంగళవారం తీజ్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేడుకలను మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్, అటవీశాఖ భద్రాద్రి కొత్తగూడెం జోనల్ సీసీఎఫ్ భీమా నాయక్, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ డి.ఎస్.వెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాం నాయక్ మాట్లాడుతూ తొమ్మిది రోజులపాటు బంజారాలు వైభవంగా తీజ్ ఉత్సవాలను జరుపుకుంటారని తెలిపారు. గోర్ బంజారా కమిటీ అధ్యక్షుడు బీఎస్.నాయక్, ప్రతినిధులు సజ్జు నాయక్, కేయూ ప్రిన్సిపాల్ సురేష్‌లాల్, డాక్టర్ ఉదయ్‌సింగ్, లోక్ వినోద్‌నాయక్, నందా నాయక్, వెంకన్న నాయక్, హేమ నాయక్, సోమ్లా నాయక్, మదన్ నాయక్, డాక్టర్ బలరాం నాయక్, అర్పిత నాయక్ పాల్గొన్నారు.

కలెక్టర్ ప్రావీణ్యను కలిసిన టీఎన్జీఓస్ నాయకులు



హన్మకొండ: హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్యను టీఎన్జీవోస్ యూనియన్ హనుమకొండలోని కలెక్టరేట్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులంతా అంకితభావంతో పనిచేసి జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని సూచించారు. టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కార్యదర్శి బైరి సోమయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, ఉమెన్ వింగ్ కన్వీనర్ రాజ్యలక్ష్మి, నాయకులు శ్యాంసుందర్, సారంగపాణి, లక్ష్మీప్రసాద్, రాజేష్ ఖన్నా, ఎర్రాప్రగడ పృథ్వీ, ప్రణయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



ఖిలా వరంగల్: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకున్నా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా సూచించారు. ఈమేరకు వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై గవిచర్ల క్రాస్‌రోడ్డు జంక్షన్‌లో ఇన్‌స్పెక్టర్ మల్లయ్యతో కలిసి ఆమె మంగళవారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఓవైన్ షాపు ఎదుట అడ్డదిడ్డంగా రోడ్డుపై నిలిపిఉంచిన వాహనాలను చూసి డీసీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

భద్రకాళి దేవాలయానికి పవర్ సప్లై ప్యానల్ బోర్డు వితరణ



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయానికి రూ.లక్ష 25 వేల విలువగల పవర్ సప్లై ప్యానెల్ బోర్డును నగరానికి చెందిన ఆర్‌ఆర్ ఎలక్ట్రికల్స్ అధినేత రాధాకృష్ణ, దుర్గాభవాని దంపతులు మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆ ప్యానల్ బోర్డుకు ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోర్డు తాళం చెవులను దేవాలయ ఈఓ శేషుభారతికి అందజేశారు.

రేపు విద్యార్థులకు పోటీలు

విద్యారణ్యపురి: ఈ నెల 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం నేపథ్యంలో హనుమకొండ జిల్లాకేంద్రంలోని ప్రాంతీయ సైన్స్‌కేంద్రంలో 22న ఉదయం 9.30గంటలకు అన్ని యాజమాన్యాల విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ తయారీ పోటీలను నిర్వహించనున్నట్లు డీఈఓ వాసంతి తెలిపారు. విస్తృతోపన్యాసం, చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని పోటీకి ఒకరి చొప్పున పాఠశాల నుంచి ఇద్దరిని హెచ్‌ఎంలు పంపాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌స్వామిని సంప్రదించాలని కోరారు.

అంధకారం

- మరమ్మతులకు నోచుకోని ఎల్‌ఈడీ దీపాలు
- లైట్లు సరఫరా చేసిన సంస్థకు గ్రేటర్ నిధుల చెల్లింపు
- ఏడేళ్ల పాటు సర్వీసు అందించాలని ఒప్పందం
- నిర్వహణ ఏజెన్సీకి చెల్లించని ఒప్పంద సంస్థ
- వేతనాలు లేక విధులకు ఎలక్ట్రీషియన్ల గైర్హాజరు



ఎల్‌బీనగర్ కాలనీలో స్తంభంపై వెలగని లైటు



లక్ష్మీగణపతి కాలనీలో అలుముకున్న చీకటి

వరంగల్: నగరంలోని 66 డివిజన్లలోని పలు కాలనీల్లో అంధకారం రాజ్యమేలుతోంది. నెల రోజులుగా ఎలక్ట్రీషియన్లు విధులకు రాకపోవడంతో ఎల్‌ఈడీ లైట్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో పలు డివిజన్లలో వీధి దీపాలు వెలగడం లేదు. విద్యుత్ బిల్లులు తగ్గించేందుకు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో గత ప్రభుత్వం ఎల్‌ఈడీ లైట్ల తయారీ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం లైట్లు సరఫరా చేసిన కంపెనీలు ఏడేళ్ల పాటు సేవలందించడంతోపాటు నిర్వహించాలని నిబంధనలు పెట్టింది. అందుకు సేవలు అందిస్తున్న ఎల్‌ఈడీ కంపెనీలకు సర్వీసు చార్జీలు ఆయా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

2018లో 80వేల లైట్ల ఏర్పాటు

ప్రభుత్వ ఆదేశాలతో గ్రేటర్ అధికారులు 2018 – 19లో నగరంలో సుమారు 80 వేల ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. వాటిని సరఫరా చేసిన కంపెనీలు బిగింపు, మరమ్మతు పనుల బాధ్యతలు థర్డ్ పార్టీ (నోయిడాకు చెందిన ఓ ప్రైవేట్ సంస్థ) కంపెనీకి అప్పగించారు. లైట్ల ఏర్పాటు, మరమ్మతు పనులు చేపట్టిన కంపెనీ స్థానికంగా ఎలక్ట్రీషియన్లను నియమించుకుంది. ప్రతినెలా నిర్వహణ కింద బల్దియా సుమారు రూ.50 లక్షలు లైట్లు సరఫరా చేసిన సంస్థకు చెల్లిస్తున్నట్లు తెలిసింది. బల్దియా నుంచి చెల్లింపులు పొందిన సంస్థ మాత్రం నిర్వహణ పనులు చేపట్టిన థర్డ్ పార్టీ సంస్థకు బకాయిలు పడినట్లు సమాచారం. మరో 6 నెలల్లో ఒప్పందం గడువు ముగుస్తున్నందున బకాయిలు వసూలు చేసుకునేందుకు స్థానిక ఎలక్ట్రీషియన్లకు వేతనాల చెల్లింపులు నిలిపివేసింది. దాంతో ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఎలక్ట్రీషియన్లు విధులు బహిష్కరించారు. ప్రస్తుతం ఎల్‌ఈడీ లైట్ల నిర్వహణ కార్పొరేషన్ అధికారులకు తలనొప్పిగా మారింది. బల్బులు, సరఫరా చేసిన సంస్థ ఎల్‌ఈడీ బల్బుల డిజైన్, పరికరాలు ఒకేలా ఉండకపోవడంతో కార్పొరేషన్‌కు చెందిన ఎలక్ట్రీషియన్లతో మరమ్మతులు చేయించలేక పోతున్నారు. ఈ విషయం కార్పొరేషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు. లైట్ల నిర్వహణకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ వ్యవహారంపై అధికారులు సీడీఎంఏ దృష్టికి తీసుకుపోయినట్లు తెలిసింది. రాష్ట్రస్థాయిలో చర్యలు తీసుకుంటే తప్ప కిందిస్థాయిలో చేసేదేమీ లేదని అధికారులు పేర్కొంటున్నారు.

ఈఈకి పర్యవేక్షణ బాధ్యతలు

లైట్ల నిర్వహణ కోసం ప్రత్యేకంగా డీఈఈ స్థాయి అధికారిని ఏర్పాటు చేశారు. సదరు డీఈ బదిలీ కావడంతో ఈ విభాగం పర్యవేక్షించే బాధ్యతలను కార్పొరేషన్‌లోని మరో ఈఈకి అప్పగించారు. ఆయన ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు చేపట్టడంతో ఈ విభాగం పర్యవేక్షణ కొరవడిందని తెలుస్తోంది. హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో ఏఈలే పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక కాలనీల్లో ఎల్‌ఈడీ లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని డివిజన్లకు చెందిన నాయకులు ఆరోపిస్తున్నారు.

ఫిబ్రవరి వరకు చెల్లించాం..

ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేసిన సంస్థ చేసుకున్న ఒప్పందం ప్రకారం నిర్వహణకు సంబంధించిన బిల్లులను ఫిబ్రవరి 2024 వరకు చెల్లించాం. ఎల్‌ఈడీ లైట్లు సరఫరా చేసే సంస్థ సేవలు అందించాల్సి ఉంటుంది. వారు నియమించుకున్న ఏజెన్సీని ప్రశ్నించే అధికారం మాకు లేదు. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకుపోయాం. త్వరలోనే సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది.

- సంతోష్, ఏఈ, వరంగల్

నెల రోజులుగా వెలగడం లేదు..



మా కాలనీలో కొన్ని లైట్లు నెల రోజులుగా వెలగడం లేదు. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. రాత్రివేళ బయటకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నాం. లైట్లు లేకపోవడంతో వర్షాకాలం అంధకారం నెలకొంది. కార్పొరేటర్, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

- రాజు, లక్ష్మీగణపతి కాలనీ

లైట్లకు మరమ్మతు చేయించాలి



నెల రోజులకు పైగా లైట్లు వెలగడం లేదు. రాత్రి వేళ బయటకు వెళ్లాలంటే భయంభయంగా ఉంది. అసలే వర్షాకాలం కావడంతో విష పురుగుల బెడద అధికంగా ఉంది. అధికారులు స్పందించి లైట్లకు మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- మమత, విశ్వనాథ్ కాలనీ

పదోన్నతులపై విద్యుత్ ఉద్యోగుల హర్షం



రేవంత్, భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న జేఏసీ నాయకులు

హన్మకొండ: అనేక ఏళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతులు కల్పించడంతో విద్యుత్ ఉద్యోగులు ఆనందంగా ఉన్నారని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జేఏసీ ప్రతినిధులు, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ అధ్యక్షుడు గంగుల మధుసూదన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం కార్యదర్శి బండారు ప్రభాకర్ తెలిపారు. ఈమేరకు హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడేళ్లుగా విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించకపోవడంతో నైరాశ్యంలో మునిగిపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు పదోన్నతులు కల్పించాయని అన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో వివిధ క్యాడర్లలో 2318 మందికి పదోన్నతులు లభించాయని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, ఎన్పీడీసీఎల్ శాఖ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లికార్జున్, వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్, టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.నరేంద్రపాల్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కె.రాజనరేందర్, సెక్రటరీ ఎస్.రమేష్ బాబు, జేఏసీ నాయకులు ఎ.హరిప్రసాద్, అక్రమొద్దీన్, పి.కోటేశ్వర్, ఎం.సుదర్శన్ రావు, బి.దేవేందర్, ఎం.సునీత, రేష్మ, జి.రమేష్, ముంతాజ్ హుస్సేన్, యాకూబ్ పాషా, ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈమేరకు శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో కందిక చెన్నకేశవులు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కులం, మతం పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూసే పార్టీలకు కాలం చెల్లిందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చే పని చేస్తోందని, పేద, మధ్య తరగతి వర్గాల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈనెల 22నుంచి 24వ తేదీ వరకు హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మేకల రవి, పంజాల రమేష్, ఎస్.కె బాష్‌మియా, పనాస ప్రసాద్ దండు లక్ష్మణ్, రవీందర్, గన్నారపు రమేష్, గుండె బద్రి, వీరగోని శంకరయ్య, మునీశ్వరుడు, సంగి ఎలేందర్, రహేలా, జన్ను రవి, ఆరెల్లి రవి, దామెర కృష్ణ, ఓర్సు రాజు, అక్బర్‌పాషా, జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను శిక్షించాలి



ధర్నా చేస్తున్న మహిళా కార్మికులు, తదితరులు

హన్మకొండ: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి డిమాండ్ చేశారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శ్రామిక మహిళా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిందితులను శిక్షించకుండా అక్కడి ప్రభుత్వం చోద్యం చూస్తోందని ధ్వజమెత్తారు. ఇలాంటి అమానవీయ సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను అమలు చేయాలని కోరారు. శ్రామిక మహిళా హనుమకొండ జిల్లా కన్వీనర్ రజిత, శ్రామిక మహిళా సబ్ కమిటీ కన్వీనర్ మాతంగి నవనీత, సీఐటీయూ నాయకులు టి.ఉప్పలయ్య, యాస బాబు, రేణుక, రజిత, శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.



కాశిబుగ్గ: కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తూ..

టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

కాశిబుగ్గ: జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఈమేరకు కాశిబుగ్గలో ఉపాధ్యాయులు మంగళవారం సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భోగేశ్వర్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల వినియోగంతో యువత చెడుదారి పడుతోందని, దాంతో అఘాయిత్యాలకు తెగబడుతున్నట్లు విమర్శించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మనోజ్, అజయ్‌బాబు, అశోక్, స్వామి, లక్ష్మిపతి, స్వామి, వెంకట్, సారయ్య, పూర్ణచందర్, గోపాల్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా రైతు రుణమాఫీ ఫిర్యాదులు 2,747

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లాలో రైతు రుణమాఫీ కాలేదంటూ వ్యవసాయ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తొలివిడత రూ.లక్ష లోపు నుంచి మూడో విడత రూ.రెండు లక్షలోపు రుణమాఫీకి సంబంధించి మంగళవారం వరకు జిల్లాలో 2,747 ఫిర్యాదులు వచ్చాయి. ముఖ్యంగా ఆధార్ కార్డు నంబర్ లింక్ లేకపోవడం, కుటుంబ యూనిట్ నిర్ధారణ కాకపోవడం, బ్యాంకు ఖాతాలో పేరు ఒకలా, పాస్‌బుక్‌లో మరోలా ఉండడం వంటి కారణాలతో చాలా మంది రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు.

ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక అధికారులు

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాలో రైతుల రుణమాఫీపై వినతులు స్వీకరించేందుకు ప్రతి మండలంలో ఒక వ్యవసాయ అధికారిని నియమించారు. వరంగల్, ఖిలావరంగల్ ఎం.రవీందర్ (7288894713)ను నియమించారు. రుణమాఫీ సమస్యల పరిష్కారానికి అర్హులైన రైతులు సంబంధిత మండల అధికారులను కలిసి వినతులు అందజేయాలని జిల్లా వ్యసాయ అధికారి కోరారు.

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సంద్ర మధు



హన్మకొండ: బీజేపీ హనుమకొండ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా హనుమకొండ కంచరకుంటకు చెందిన సంద్ర మధును నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలిపారు. ఈమేరకు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు మధు కృతజ్ఞతలు తెలిపారు.

46వ డివిజన్ అధ్యక్షుడిగా రమేష్

మడికొండ: బీజేపీ 46వ డివిజన్ అధ్యక్షుడిగా రాంపూర్ గ్రామానికి చెందిన పిట్టల రమేష్‌ను నియమించినట్లు పార్టీ హనుమకొడ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమాధి పేరుతో వసూళ్లకు పాల్పడలేదు



సమావేశంలో మాట్లాడుతున్న నూరొద్దీన్

ఖిలా వరంగల్: సీసీ కెమెరాల విధ్వంసానికి పాల్పడిన వ్యక్తులను వదిలిపెట్టబోమని, కబ్రస్థాన్‌కు వచ్చే మృతుల కుటుంబ సభ్యుల నుంచి సమాధి పేరు చెప్పి ఎలాంటి వసూళ్లకు పాల్పడలేదని ఈద్గా, మసీదు కబ్రస్థాన్ కేర్ టేకర్ ఎంఏకే తన్వీర్, హజ్రత్ సయ్యద్ జానుల్లాహ షాహిద్ ఖబ్రస్థాన్ అధ్యక్షుడు ఎండీ.నూరొద్దీన్ అన్నారు. వరంగల్ పోర్ట్ రోడ్డు ఈద్గా, మసీదులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈద్గా, మసీదులో సీసీ కెమెరాలను ధ్వంసం చేయడమే కాకుండా ఫిర్యాదు చేసిన వ్యక్తులపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న వ్యక్తులపై చట్టప్రకారం న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కబ్రస్థాన్‌కు వచ్చే మృతుల కుటుంబాల నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు తాము వసూలు చేసినట్లు తప్పుడు రశీదులు సృష్టించిన వ్యక్తులపై గతంలోనే ఫిర్యాదు చేసినట్లు గుర్తుచేశారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా విలువైన జానుల్లాహ షాహిద్ కబ్రస్థాన్ కబ్జాకు గురికాకుండా కాపాడేందుకే కేర్ టేకర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ముస్లిం ప్రతినిధులు షఫీయొద్దీన్, మన్సూర్, ఆఫీజొద్దీన్, ఖాదర్, యాకూబ్ అలీ, ముజాహిద్ ఖాద్రి, యాకూబ్‌పాషా, రబ్బాని, ముఖీద్, మోహిన్, ఖహీం, మస్తాన్, ఖాజా, మొహిన్, నదీమ్ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళి



హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



కేయూ మొదటి గేట్ వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిరుద్యోగ జేఏసీ బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: మాజీ ప్రధాని, దివంగత రాజీవ్‌గాంధీ జయంతిని హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంపీ కడియం కావ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

కేయూలో రాజీవ్‌గాంధీ జయంతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్‌వద్ద తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, కాంగ్రెస్ నాయకుడు మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, బాధ్యులు సుమన్, శ్రీనివాస్, రాంబాబు, రాంచందర్, దయాకర్, అరుణ్‌కుమార్, విఘ్నేష్, నరేందర్, మూర్తి పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

మడికొండ: దేశానికి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరువలేనివని మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ కొనియాడారు. మడికొండ గ్రామశాఖ అధ్యక్షుడు దువ్వ విజయ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రటానికి పూలమాలలు వేసి మడికొండ చౌరస్తాలో మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజుయాదవ్ మాట్లాడుతూ దేశంలోకి సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొవచ్చిన మహోన్నత వ్యక్తి అని, 18ఏళ్ల వారికి ఓటు హక్కును కల్పించిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. వారల వెంకన్న, గుర్రం అమర్‌నాథ్, బైరి లింగమూర్తి, వస్కుల శంకర్, శ్రీనివాస్, కుర్ల మోహన్, కొప్పుల నవీన్‌యాదవ్, బరిగల శ్రవణ్, శివ, నాగరాజు, రమేష్, సంపత్‌రెడ్డి, పసునూరి శ్రీను, అర్జున్, వినయ్, వేణు పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట రూరల్: రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాజీపేట డీజిల్‌కాలనీ సెంటర్ వద్ద మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


సీతంపేటలో..

హసన్‌పర్తి: మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను హసన్‌పర్తి మండలం సీతంపేటలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ తోకల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుగుణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, యూత్ అధ్యక్షుడు చరణ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మదన్, పూల, సుమలత, దేవస్థాన ధర్మకర్త ఆరెల్లి వెంకటస్వామి పాల్గొన్నారు.

కడిపికొండలో..

కాజీపేట అర్బన్: రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కడిపికొండ గ్రామంలో కాంగ్రెస్ కడిపికొండ గ్రామశాఖ అధ్యక్షుడు కట్కూరి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి, సట్ల సదానందం, నర్మెట వేణు, రాజయ్య, బస్కే కృష్ణ, శ్రీనివాస్, విజ్జగిరి, కోటేశ్వర్, వీరస్వామి, లత పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



గద్దెను బాగు చేయరూ!

ఫోర్ట్‌రోడ్డుపై ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లోని డివైడర్ ధ్వంసమైంది. లారీలు ఢీకొట్టగా రాళ్లు ఊడి కిందపడుతున్నాయి. నెలలు గడిచినా వాటిని అక్కడ నుంచి తొలగించలేదు. గద్దెను తిరిగి నిర్మించలేదు. దాంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - ఖిలా వరంగల్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
భీమ్‌రావు, కుడా అధికారి
ఫోన్‌నంబర్ : 98665 14553

డబ్బాల తొలగింపుపై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం



చిరువ్యాపారులను ఓదారుస్తున్న నరేందర్

రామన్నపేట: వరంగల్ పోచమ్మమైదాన్ సమీపంలో పోచమ్మగుడి వెళ్లే ప్రాంతంలో కొన్నేళ్లుగా రోడ్ల పక్కన వీధి వ్యాపారం చేసుకొని జీవించే వారికి ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా కూల్చివేయడంపై మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న 12మంది వీధి వ్యాపారుల డబ్బాలను మంగళవారం కార్పొరేషన్ అధికారులు తొలగించారు. విషయం తెలుసుకున్న నరేందర్ అక్కడి చేరుకొని వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 48 ఏళ్లుగా చిరువ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్న ఓ వికలాంగుడి షాపును కూడా కనికరం లేకుండా కూల్చివేయడం బాధకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక మంత్రి, ఎమ్మెల్సీలు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇలాంటి దుర్మార్గపు పనులు చేపడుతున్నారని, ఇలాంటి కార్యక్రమాలు ఆపకపోతే మున్ముందు తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు.

సంక్షిప్తంగా

ఆర్టీసీ వరంగల్ –1 డిపోలో సంబురాలు

హన్మకొండ: రాఖీ పండుగ సందర్భంగా 100శాతం ఆక్యుపెన్సీ రేషియో దాటిన సందర్భంగా హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ –1 డిపోలో ఉద్యోగులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను మాట్లాడుతూ రాఖీ పండుగ రోజు 71,107 కిలో మీటర్ల మేర బస్సులు నడవగా, రూ.50.96 లక్షల ఆదాయం సమకూరినట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం కేశరాజు భానుకిరణ్, వరంగల్ –1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు, అసిస్టెంట్ మేనేజర్లు చిమ్మని సంతోష్, శ్రీనివాసులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మైసమ్మ విగ్రహానికి జలాధివాసం

ఖిలా వరంగల్: వరంగల్ విద్యానగర్ కాశికుంటలో మంగళవారం రెండోరోజు కట్టమైసమ్మ పునఃప్రతిష్ఠాపన పూజలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కట్టమైసమ్మ తల్లి విగ్రహానికి జలాధివాసం చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ప్రతినిధులు కావేటి శంకర్, ట్రాన్స్‌జండర్ రంజిత, అచ్చ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో వేద పండితుడు జాగర్లపూడి కోటయ్యశర్మ నేతృత్వంలో కట్టమైసమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం యాగశాల ప్రవేశం, గణాధిపతి పూజ, హోమం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పింగిలి యాకయ్య, ఆడెపు లక్ష్మణ్, సాంబయ్య, సురేందర్, బాబురావు, రవీందర్, సునీల్, రాజేష్, శైలజ, శ్రీనివాస్, ప్రశాంత్, అయిలయ్య, రవీందర్, ప్రణయ్‌కుమార్, గణేష్, రాజు, ముకుందం, రామచంద్రం పాల్గొన్నారు.

‘గురుకులాల్లో నియామకాల్లో అవకతవకలు’

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో మహాత్మా జ్యోతిరావు పూలే వెనుబడిన తరగతుల (బీసీ) గురుకులాల్లో గెస్ట్ ఉపాధ్యాయుల నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, బీఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్, స్వేరోజ్ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేందర్‌ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వాట్సప్, ఎక్స్ వేదికగా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న వారికే ఈనెల 12, 13, 14వ తేదీల్లో డెమోలు నిర్వహించి అర్హత గల వారినే ఎంపిక చేసినట్లు బీసీ గురుకులాల ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డి తెలిపారు.

మడికొండ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతల స్వీకరణ

మడికొండ: కాజీపేట మండలం మడికొండ ఎస్‌హెచ్‌ఓగా పి.కిషన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన ప్రతాప్ మరోచోటుకు వెళ్లారు. ఈ సందర్భంగా కిషన్‌కు పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజబాబు, దివ్య, ఏఎస్సైలు చంద్రమౌళి, రమేష్, హెడ్ కానిస్టేబుల్ రాంచందర్, సిబ్బంది పాల్గొన్నారు.

వరంగల్ క్రైం: మడికొండ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పుల్యాల కిషన్ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

సీనియర్ న్యాయవాది మృతి

వరంగల్ లీగల్: సీనియర్ న్యాయవాది గంట సంజీవరెడ్డి (68)గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. సంజీవరెడ్డి 1982వ సంవత్సరం నుంచి జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2011- 2014వ సంవత్సరంలో జిల్లా కోర్టులో ప్రభుత్వ ప్లీడర్‌గా పనిచేశారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సంజీవరెడ్డి మృతిపై వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శు తీగల జీవన్‌గౌడ్, ముదస్సిర్ అహ్మద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు సంతాపం తెలిపారు.

ప్రైవేట్ హాస్టళ్ల అసోసియేషన్ ఎన్నికలు

నయీంనగర్: సెప్టెంబర్ 22న గ్రేటర్ వరంగల్ పరిధిలోని ప్రైవేట్ హాస్టళ్ల అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎలక్షన్ కమిటీ కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు.